# మళ్ళీ ఎపుడొస్తుంది

నిన్న కాక మొన్న అదొక అందమైన ఊరు! ఇవాళ అది కేవలం స్మశాన వాటిక!!

మనిషిలో వుండే సంకుచిత మనస్తత్వాన్ని అపహాస్యం చేస్తున్నట్టుగా ఎవరికి వారు వేర్వేరుగా కట్టుకున్న ఇళ్ళనీ - ఏర్పరచుకున్న పొలం గట్లనీ, నేలమట్టం చేసింది భూకంపం...

తన చుట్టూ తానూ తిరుగుతూ, సూర్యుని చుట్టూ తిరగవలసిన భూమాత నిద్రమత్తులో - ఆదమరచి కొన్ని క్షణాలు క్రమం తప్పింది... తప్పటడుగులు వేసింది. అందుకే అక్కడి భూమి కంపించింది!

నిన్నకాక మొన్న అదొక అందమైన గ్రామమని ఇవాళ చెప్తే - ఆ బ్రహ్మదేవుడు కూడా నమ్మడు!... అక్కడి ప్రజలకు సంభవించింది విపత్తుకాదు, విలయం....! అక్కడ జరిగింది ప్రమాదం కాదు - ప్రళయం!!!

ఎటుచూసినా గుంపులు గుంపులుగా శవాలు... కనుచూపు మేర యావత్తూ కనిపిస్తున్నాయి రాళ్ళ గుట్టలు...

ఆ శవాల గుంపుల్లో - ఆ రాళ్ళ గుట్టల్లో తన ఇల్లు ఎక్కడో, తనవాళ్ళు ఎక్కడ వున్నారో అంతు బట్టటం లేదు అయిలయ్యకి!

హోరున కురుస్తున్న వర్షంలో - వంచిన నడుం ఎత్తకుండా శవాల ముఖాల్ని పరికించీ రాళ్ళ గుట్టల్ని తొలగించీ వెతుకుతున్నాడు...! అక్కడా ఇక్కడా అనికాకుండా ఎక్కడ పడితే అక్కడ పిచ్చివాడిలా వెతుకుతున్నాడు...!

అయినవాళ్ళంతా అయిపు లేకుండా పోతే తానొక్కడూ మిగిలాడు. ఇపుడు తన ఇంటిమీద భ్రాంతి లేదు... తన జీవితం మీద మమకారం అంతకంటే లేదు... ఉన్నదల్లా భార్యా బిడ్డల శవాలు ఎక్కడైనా కనిపిస్తాయేమోనన్న చిగురంత ఆశ... అంతే!!!

వేలమందితో పాటు తన భార్యా బిడ్డా కూడా భూకంపానికి బలి అయ్యారు. పంటకి ఎరువు కొనాలని పక్కనున్న పట్నానికి వెళ్ళి వుండకపోతే తానూ హాయిగా వాళ్ళతో పాటే భూగర్భంలో కలిసిపోయేవాడు... ఆ అదృష్టం తనకు లేకుండా చేశాడు ఆ భగవంతుడు.

బ్రతికి బయటపడి దురదృష్టవంతుడయ్యాడు!

భూకంపానికి ఆ గ్రామంలోని ఇళ్ళన్నీ పూర్తిగా ధ్వంసమయ్యాయి... ఎంతో మంది

చిన్నా పెద్దా, ఆడా మగా అనే భేదం లేకుండా శవాలుగా మారిపోయారు. పోల్చుకునేందుకు వీల్లేకుండా కొంత మంది చితికి పోయారు...

ఏ మూలనో తన భార్య ముక్కుపుడక, తన అయిదేళ్ళ కొడుకు మొలత్రాడుకి వేలాడే జార్జిబొమ్మ రూపాయిబిళ్ళా కనిపిస్తాయేమో పోల్చుకోవచ్చునన్న ఆశ చావక ప్రతిచోటా గుచ్చిగుచ్చి చూస్తున్నాడు అయిలయ్య.

అతని ఆశ నిరాశయింది....

దాహమేసినా మంచినీళ్ళు తాగాలనిపించలేదు... అనిపించినా అక్కడ అవి ఇపుడంత సులభంగా దొరకవు!

ఆకలేసినా నాలుగు ముద్దలు తినాలనిపించలేదు... అనిపించినా ఇపుడక్కడ తినిపించే మనిషి కనిపించడు!

తిరిగి తిరిగి శోషొచ్చి పడిపోయాడు అయిలయ్య... అక్కడ సహాయ కార్యక్రమాల్ని నిర్వహించటానికి వచ్చిన 'ఆర్మీ' మనుషులు అయిలయ్యను, ఆస్పత్రిలో చేర్చారు... 'సెలైన్' ఎక్కించారు డాక్టర్లు!... మర్నాడు రొట్టె, పాలూ ఇచ్చారు.

మూడో నాటికి వర్షం తగ్గింది.

ఆస్పత్రిలో వున్న అయిలయ్యకు కాస్త ఓపిక వచ్చింది...

మళ్ళీ కాళ్ళీడ్చుకుంటూ తన ఊరు చేరుకున్నాడు!

"తన ఊరు!"

అలా అనుకోవటంలో ఓ అనుభూతి... ఆ అనుభూతి అంచున ముళ్ళపొదలా గూడుకట్టుకున్న ఆవేదన...

ఆ ఊళ్ళో తనదంటూ తనకేదీ మిగల్లేదు! అయినా మరెప్పటి అనుబంధమో అది?.... మనసుకి మమకారపు సంకెళ్ళు బిగించి, మళ్ళీ తనను అక్కడకు లాక్కొచ్చిన ఊరు!

ఆ ఊరు ఇపుడిపుడే మేల్కొంటోంది...

పోయిన వాళ్ళు పోగా మిగిలినవాళ్ళు ఒళ్లు విరుచుకుని దిగుళ్ళు దిగమ్రింగుతున్నారు. ఒకరినొకరు ఓదార్చుకుంటున్నారు... ఎక్కడెక్కడినించో లారీలు వస్తున్నాయి... ఆ లారీల్లోంచి అన్నం పొట్లాలూ, బట్టలూ, నీళ్ళూ, అన్నీ పంచుతున్నారు... మిగిలిన వారికి బ్రతుకు మీద ఆశల్ని పెంచుతున్నారు.... ఆ ఊళ్ళో మొత్తం ఇరవైవేల మందికి పైగానే పోయారట... ఇప్పుడక్కడ ఎక్కడ చూసినా 'సైన్యం మనుషులే' కనిపిస్తున్నారు... కొందరు ఇంకా శవాల్ని బయటకు తీస్తున్నారు.

అయిలయ్య అందర్నీ గమనిస్తున్నాడు... అంతా చూస్తున్నాడు!

అయిదార్రోజుల క్రితం -

పాపిరెడ్డికి ఆ ఊళ్ళో పదహారు గేదెలుండేవి. పదునైన పంట పొలాలుండేవి...

నాయుడుకి డాబుగా వెలిగిపోయే డాబా ఇల్లుండేది... ఆ ఇంట్లో దీపం పెట్టే ఇల్లాలుండేది... పూజారి పంతులు గారికి దేవుడు పాండురంగ డుండేవాడు.. ఆయన పేరున అయిదెకరాల మాగాణీ వుండేది!

ఇంకా - బట్టలుతికే బ్రహ్మయ్య, పాలుపోసే పైడమ్మా, కుండలు చేసే వీరన్న - అందరికీ అయిదార్రోజుల క్రితం అంతో ఇంతో వుండేది... అంతస్తుల తారతమ్యాన్ని అడుగడుగునా గుర్తు చేసేది!

అయిదార్రోజుల తర్వాత -

ఇపుడక్కడ వాళ్ళల్లో చాలా మంది మిగల్లేదు... మిగిలిన వాళ్ళెవరికీ తమదంటూ ఏమీ మిగల్లేదు! ఇపుడు మిగిలిన వాళ్ళందరిదీ ఒకే కుటుంబం!... అందరూ కలసి మళ్ళీ 'ఊరు' కట్టుకుంటున్నారు... అంతరాలు మరచిపోయి పేరెట్టి పిల్చుకుంటున్నారు. వింతగా ఒకే పంక్తిన కూర్చుని సైనికులు పంచుతున్న కలో గంజో కలసి తాగుతున్నారు.

ఆ మధ్యాహ్నం -

సూరీడు నడినెత్తి కొచ్చినా తన కడుపులో 'ఆకలి వేడి' చురుక్కుమనిపిస్తున్నా - అక్కడకు వెళ్ళి అన్నం తినాలని అనిపించలేదు అయిలయ్యకి... నరాల్లో నిస్సత్తువే రక్తమై ప్రవహిస్తోంది. గతం రేపిన చితిమంటల తాలూకు ఎర్రదనం - అతని కళ్లల్లో ప్రతిఫలిస్తోంది. కనుచూపు మేరలో ఎక్కడా నీడనిచ్చే చెట్టు కూడా కనిపించటం లేదు.

కానీ - ఆ వేడిఎండ వెల్తురులో దూరంగా కదలివస్తున్న నీడ కనిపించిందతనికి ! ఆ నీడ జాడన ఎవరో ఆడమనిషి!....

చప్పున గుర్తుకు రాలేదు ఎవరో...

దగ్గరగా వచ్చింది... మాసిపోయి చిరిగిపోయిన తెల్లచీరలో ముడతలు పడిన అవయవాల అవశేషాల్ని దాచుకుని అడుగులో అడుగువేసుకుంటూ ఏదో అడగాలన్న ఆత్రంతో - అయిలయ్య దగ్గరకు ఆశగా వచ్చింది.

పిచ్చిపిచ్చిగా ఉన్న తెల్లజుట్టులోనికి వేళ్ళు గుచ్చుకుని బరబరా గోక్కుంటూ అయిలయ్య వైపు చూసింది!

"బాబూ!" ఏదో అడగబోయి - అరక్షణం పాటు చుట్టూవున్న రాళ్ళ గుట్టల్ని చూసింది... ఆ తర్వాత నోరు తెరచి 'ఆకలి' అని అడగలేదు... చేయి చాచి 'ధర్మం' అని అర్థించలేదు...

దుఃఖంతోటీ, వయస్సుతోటీ పూడుకు పోయిన గొంతు పెగల్చుకొని కష్టంగా అడిగింది -

"మళ్ళీ బూకంపం వస్తుందని అందరూ సెప్పుకుంటున్నారు... ఎప్పుడొస్తుంది బాబూ" అని

ఆమెను అయిలయ్య గుర్తుపట్టాడు....
ఊరిచివరి పూరి పాకలో వుండే మరియమ్మ!!

★ ★ ★

మరియమ్మ మొగుడు ఆశీర్వాదం ఫాక్టరీలో పనిచేసేవాడు... పనంటే ఎంత ప్రాణమో మరియమ్మంటే అంత ప్రేమ ఆశీర్వాదానికి!

పెళ్ళయి పదేళ్ళైపోయినా వాళ్ళకు పిల్లలు పుట్టలేదు... మరియమ్మ మనోవేదన గమనించి ఆశీర్వాదం తల్లడిల్లిపోయాడు.

"పుడతార్లే మావా! అప్పుడే వయసైపోయినట్టు దిగులు పడతావెందుకు?" - అంటూ తన ఆవేదనని గుండెల్లో దాచుకుని భర్తను ఓదార్చేదామె!

"వయసైపోయిన తర్వాత పుడితే వాళ్ళ ముద్దు ముచ్చటలు మనం చూడొద్దటే వెర్రిమొద్దా?" - అనేవాడు ఆశీర్వాదం...

తనకు ఆతృత లేకపోయినా భర్త ముచ్చట తీరటానికి తాను త్వరగా 'తల్లి' కావాలని ప్రతి ఆదివారం చర్చిలో ఏసుప్రభువును కోరుకునేది...

'షిర్డీలో సాయిబాబాను కొలుచుకుంటే - తలచుకున్నది జరుగుతుందని' - ఎవరో చెప్తే - భర్తతో కలసి వెళ్లి బాబాను ప్రార్థించింది... ఆ తర్వాత ఆరు నెలలకే మరియమ్మ గర్భవతైంది...

పుట్టిన మగబిడ్డకు 'సాయిరాం' అని పేరు పెట్టుకొంది....

"సాయిరాం'ని వాళ్లు మామూలుగా పెంచలేదు... పువ్వుల్లో పెట్టి పెంచుకున్నారు... వాడి నవ్వుల్లో ఆనందాన్ని పంచుకున్నారు... అయిదేళ్లు రాగానేవాణ్ణి బళ్ళో చేర్పించారు...

ఆ తర్వాత కొంతకాలానికి ఆశీర్వాదం గుండెజబ్బుతో ఆస్పత్రిలో చేరాడు... అంతవరకూ అతను రెక్కలు ముక్కలు చేసుకుని కూడవేసిన డబ్బుంతా మందులకోసం మంచినీళ్లలా ఖర్చయిపోయింది... అయినా ఫలితం లేకపోయింది. ఆశీర్వాదం ప్రాణాలు అనంత వాయువుల్లో కలసిపోయాయి.

అప్పటికి ఆరేళ్ళు కూడా నిండని 'సాయిరాం' బరువు బాధ్యతలన్నీ మరియమ్మపై పడ్డాయి...

ఆమెకు బ్రతుకు దుర్భరమైంది... అప్పుడప్పుడు ఆ బ్రతుకు పట్ల విముఖత కలిగేది... 'సాయిని బాగా చదివించి - వృద్ధిలోకి తీసుకురా!... నేనిప్పుడు ఆ ప్రభువు దగ్గరకు వెళ్ళిపోతున్నా - మళ్లీ వాడికి కొడుకుగా పుడతాను. అపుడు నీ ఒడిలో ఆడుకుంటాను!" - అన్న భర్త ఆఖరి మాటలు ఆ క్షణంలో మళ్ళీ ఆమెలో ఆశల దీపాల్ని వెలిగించేవి... బతకాలన్న కోరిక కలిగించేవి! 'సాయిరాం' కోసమే మరియమ్మ బతికింది... ఊరిమధ్య వున్న చిన్న పెంకుటిల్లు అమ్మేసి ఆ వచ్చిన డబ్బుతో అతన్ని చదివించింది... తన నివాసాన్ని ఊరిచివరి పూరిపాకలోకి మార్చింది... తన కడుపు మాడ్చుకుని కొడుక్కి కడుపు నిండా అన్నం పెట్టింది...

పదో క్లాసు పాసయ్యాక - పంచదార ఫ్యాక్టరీలో సాయిరాంకి ఉద్యోగం వచ్చింది... అప్పటికే శారీరకంగానూ, మానసికంగానూ ఎంతో అలసిపోయిన మరియమ్మ తొందరగా తన కొడుక్కి పెళ్లి చేయాలని ఆరాటపడింది!...

తన కొడుక్కి పెళ్ళయితే - తన భర్త ఆ ఇంట్లో మళ్ళీ పుడితే - ఒక్కసారి ఆ బిడ్డను గుండెలకు హత్తుకుని - తనివి తీరా ముద్దాడి ఆఖరి శ్వాస విడవాలన్నది ఆమె అంతరాల్లోని ఆలోచన !....

తన కొడుక్కి ఏదైనా సంబంధం చూడమని - తనకు తెలిసిన నలుగురికీ చెప్పింది...

రోజులు... వారాలు... నెలలూ గడిచిపోతున్నాయే తప్ప ఆ శుభఘడియలు రానేలేదు... ఈ లోగా సాయిరాం ప్రేమలో పడ్డాడు... ఆ ఫ్యాక్టరీలో పనిచేసే సీతాలు కూడా 'సాయిరాం' పట్ల మక్కువ పెంచుకుంది...

"నీకు కులమతాల పట్టింపులు లేకపోతే మనిద్దరం పెళ్లిచేసుకుందాం!" అన్నాడు సాయిరాం.

"నాకు 'నా' అన్నవాళ్లెవరూ లేదు!.. ఇంక కులమతాల పట్టింపు లెందుకుంటాయి... నేనిక్కడ సంపాదించింది నా మేనమామ చేతిలో పెడితే - నాకింత అన్నం పెట్టి - ఆదరణ చూపుతున్నాడు..." చెప్పింది సీతాలు....

ఆ మర్నాడే సీతాల్ని తీసుకెళ్ళి తన తల్లికి చూపించాడు... ఆమెను తాను పెళ్లి చేసుకుంటానని చెప్పాడు.

కాటికి కాళ్లు చాపుకున్న మరియమ్మ ఆ 'కళ్యాణ ఘడియ' కోసమే ఎదురు చూస్తున్నానని చెప్పింది....

మరియమ్మ ఆశీస్సులతో - ప్రభువు సమక్షంలో సాయిరాం - సీతాలు దంపతులయ్యారు...

నూతన దంపతులకు అది మొదటి రాత్రి...

మరియమ్మకు కాలూ చేయి ఆడలేదు.. ఆ పూరి గుడిసెలో కొడుకునీ కోడల్నీ వదిలి - తాను ఎదురింటి నాయుడుగారి వీధి అరుగుమీద ఆ రాత్రి గడిపేయగలదు...

కానీ ఎందుకో ఆమెకు మనసొప్పలేదు... ఏం చేయాలో పాలు పోలేదు... ఇంట్లోకీ వీధిలోకి కాలుకాలిన పిల్లిలా తిరుగుతోంది...

ఆమె వయసులోని ఆరాటాన్ని గ్రహించిన నాయుడు గారు ఆమెను పిలిచారు...

"మా అబ్బాయి పట్నంలో చదువుకి వెళ్లినప్పట్నించీ - పెరట్లో డాబాగది ఖాళీగానే వుంటోంది... వాడి చదువు ఇంకా రెండేళ్ళకు గానీ పూర్తికాదు.. అంత వరకూ మీరు అందులో వుండండి.." అన్నారాయన....

"మీ మేలు మర్చిపోను బాబూ!" చేతులు జోడించి నమస్కరించింది మరియమ్మ... మరియమ్మ నాయుడుగారింట్లో పదేళ్లుగా పనిచేస్తోంది....

ఆమెలోని మంచితనమే - నాయుడుగారి చేత ఆ మంచి మాట అనిపించింది... మరి క్షణం సేపు ఆలోచన చేయలేదు మరియమ్మ... అరక్షణం కూడా ఆలస్యం చేయలేదు...

నాయుడు గారి పెరట్లో వున్న డాబా గదిలో కొడుక్కీ కోడలుకీ శోభనం ఏర్పాటు చేసింది. మంచం మీద తెల్ల చీర పరచింది.... పక్కనే ముక్కాలిపీటవేసి దాని మీద ఇత్తడి గ్లాసుతో పాలు పట్టింది... గాంధీ బొమ్మ దగ్గరకెళ్లి రెండు రూపాయల మల్లెపూలు కొని తెచ్చి వాటిని కోడలి జడలో అలంకరించింది....

తన మనసు నిండిన సంతృప్తిని కన్నీటి తడిలో దాచుకొని - కోడల్ని ఆ డాబా గదిలోకి పంపించి తాను తిరిగి తన గుడిసెలోకి వచ్చి భర్త ఫోటోని అలా గుండెలపై పెట్టుకుని హాయిగా నిద్రపోయింది.... అలా ఎంత సమయం గడిచిందో...

అంతలో ఏదో శబ్దమైంది... మరియమ్మకు హఠాత్తుగా మెలకువ వచ్చేసింది...

దూరం నించే ఏవో ఫెళ ఫెళ మనే శబ్దాలు మరింత ఎక్కువయ్యాయి...

ఏం జరుగుతోందో ఊహించుకునే సరికి - తన పూరి గుడిసె నేల కొరిగిపోయింది.

మట్టి పెళ్ళల్నీ - తాటి వాసాన్ని తప్పించుకుని బయటకొచ్చింది... చుట్టూ అంతా చీకటి!

తాను నిలబడిన నేల కదిలిపోతోంది...

ఏడ్పులు... పెడబొబ్బలు.. హాహాకారాలు!.. పరిసర ప్రాంతమంతా వాటితో మార్మోగిపోయింది.

గబగబా రాయడు గారింటి వైపు పరుగెత్తింది.

దారి కనిపించ లేదు!

"భూకంపం వచ్చింది" - అందరూ చెప్పుకుంటుంటే ఆ మాటలు మరియమ్మ చెవిన పడ్డాయి.

"సాయిరాం!" - అంటూ అరిచింది.

అప్పటికే సాయిరాం తన భార్యతో సహా పిలుపు అందనంత దూరానికి వెళ్లిపోయాడు.

★ ★ ★

"మళ్లీ భూకంపం వస్తుందా బాబూ?"

ఆలోచిస్తున్న అయిలయ్య భుజం పట్టుకుని కుదుపుతూ అడిగింది మరియమ్మ. ఈ సారి మళ్లీ భూకంపం వచ్చినపుడైనా తాను దాటిపోవాలని ఆమె ఆశ కావచ్చు...

"వద్దవ్వా! ఇంక భూకంపం రాకూడదు.. ఇక్కడే కాదు... ఎక్కడా రావాలని కోరుకోద్దు"- అని చెప్పాలను కున్నాడు. కానీ అతని గొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

"ఒరే అయిలయ్యా! ఇక్కడ వున్నారేమిటి?... అవతల అందరికీ అన్నం పొట్లాలూ, గుడ్డలూ పంచుతున్నారు... పద" - అంటూ వచ్చాడు అక్కడికి, అతని మిత్రుడు రాజయ్య.

"నువు కూడా రా మరియమ్మా! అన్నం తిందువుగాని" - అంటూ ఆమె చేయి పట్టుకున్నాడు అయిలయ్య.

ఆమె పిచ్చి చూపులు చూస్తూ అతని వెంట నడిచింది.

అన్నం పొట్లం చేతిలో పెడితే - దాన్ని అలాగే చూస్తూ కూర్చుండిపోయింది. తన చేత్తో ముద్ద తీసి మరియమ్మ నోటికి అందించాడు అయిలయ్య.

కానీ ఆ ముద్ద ఆమె గొంతు దిగలేదు. ఆమె కళ్ళల్లో మెరుస్తున్న కన్నీటిని చూసి -

"బువ్వ తినేటపుడు ఏడవకూడదవ్వా!... నీకు తెలీదా...? నా పెళ్లాం, కొడుక్కి చెప్పేది!... ఆళ్లు ఇపుడు లేరు. భూకంపం వచ్చి ఆళ్ళను ఎత్తుకు పోయిందిగా"- అన్నాడు అయిలయ్య.

ఆ మాట విన్న మరియమ్మ ఉలిక్కిపడి చూసింది.

"నిన్ను సూత్తంటే నా కళ్లల్లో సాయిరాం కనిపిస్తున్నాడు... ఆడు మిగిలి నేను పోయినా బావుండేది" - అంటూ కళ్లు తుడుచుకుందామె.

అయిలయ్య అందించిన అన్నం ముద్దను కష్టం మీద గొంతు దింపి మళ్లీ అడిగింది ఆశగా, ఆత్రంగా -

"ఒరే బాబూ!.. రేపు మళ్లీ భూకంపం వచ్చినపుడు నేను పోతే నాకు నువ్వు తలకొరికి పెడతావా...?"

*(ఈనాడు, ఆదివారం అనుబంధం, 21-11-1993)*

★ ★ ★